
నిలిచిన ఆలయ రోడ్డు పనులు

- మూడు నెలల్లో కందికొండ జాతర
- రోడ్డు నిర్మాణాలతో తీరనున్న భక్తుల కష్టాలు
- పనులు కొనసాగించాలని కోరుతున్న ప్రజలు

కురవి: మండలంలోని కందికొండ శివారులోని కందగిరి పర్వతం చుట్టూ ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. కందగిరి పర్వత శిఖరంపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంది. పర్వతం మధ్యలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సైతం ఉంటుంది. శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం ప్రతీ ఏటా కార్తీక పౌర్ణమి రోజున నిర్వహించడం ఆనవాయితీ. అదే రోజున కందికొండ జాతర జరుగుతుంది. జాతరకు పలు జిల్లాల నుంచి భక్తజనం తరలివస్తారు. ఇప్పటి వరకు గుట్ట వద్దకు చేరుకోవాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గుట్టకు చేరుకోవడానికి భక్తులు నానా అవస్థలు పడుతుంటారు. అయితే గత ప్రభుత్వం కందికొండ మెయిన్ రోడ్డు నుంచి గుట్ట వయా అయ్యగారిపల్లి జాతీయ రహదారి వరకు రూ.3కోట్లతో బీటీ రోడ్డు, అయ్యగారిపల్లి నుంచి గుట్ట ఆలయం మెట్ల వరకు రూ.3కోట్లు, కందికొండ–సూదనపల్లి మార్గం నుంచి లచ్చాతండా వరకు రూ.2.40కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు 2023 అక్టోబర్ 4వ తేదీన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణాల కోసం ఫార్మేషన్ నిర్మాణం పూర్తయింది. కంకర చిప్స్ పనులు సైతం పూర్తయ్యాయి. గుట్ట చుట్టు బీటీ నిర్మాణాలు పూర్తి అయితే జాతరకు వచ్చే భక్తుల కష్టాలు తీరనున్నాయి. గుట్ట వరకు వాహనాల రాకపోకలు జరిగి, భక్తులు నడిచి వచ్చే పరిస్థితి పోతుందని భక్తులు ఆశిస్తున్నారు.


శ్రీలక్ష్మీనర్సింహస్వామి కొలువైన కందగిరి పర్వతం

నిలిచిన పనులు..

కందికొండ గుట్ట చుట్టూ మూడు మార్గాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలకు ఫార్మేషన్ పూర్తి చేసిన కాంట్రాక్టర్లు పనులను మధ్యలో నిలిపివేశారు. చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు ఆపివేసినట్లు సమాచారం. కందికొండ జాతర నవంబర్ 5వ తేదీన కార్తీక పౌర్ణమి రోజున జాతర నిర్వహిస్తారు. వచ్చే కార్తీక పౌర్ణమి నాటికి రోడ్ల నిర్మాణలు పూర్తి అయితే భక్తుల కష్టాలు తీరుతాయి. లేకుంటే ప్రతీ ఏడాది మాదిరిగానే భక్తులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అధికారులు చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్య తీసుకుంటే భక్తుల ఇబ్బందులు తీరుతాయి.


గుట్ట వరకు నిర్మించిన ఫార్మేషన్ రోడ్డు

రోడ్డు పనులు పూర్తి చేయాలి



కందగిరి పర్వతం ఇరువైపులా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలి. పనులు పూర్తి అయితే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. బీటీ రోడ్డుతో భక్తుల కష్టాలు తీరుతాయి.

– దువ్వ సైదులు, కందికొండ

క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవంగర/మరిపెడ రూరల్: భూభారతి పోర్టల్ ద్వారా కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు గతంలో దరఖాస్తు చేసుకోలేని రైతులకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వామి నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025 జూన్ 28 వరకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 13వ తేదీలోపు ఏఈఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాలు వయసు ఉన్న రైతులకు మాత్రమే బీమాకు అర్హులు. అదే విధంగా గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు మార్పులు చేర్పులుంటే ఈ నెల 30వ తేదీ లోపు సవరణలు చేసుకోవచ్చని తెలిపారు.

విజయవంతం చేయండి



మరిపెడ: ఈనెల 19నుంచి 22 వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో తలపెట్టిన సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవతం చేయాలని మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. సీపీఐ మహా సభలకు చెందిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎండీ ఎబ్దుల్ రషీద్, నాయకులు నర్సయ్య, బాలు, హుస్సేన్, రవికుమార్, వీరేందర్ పాల్గొన్నారు.

మహిళకు తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణ కాలనీకి చెందిన భూక్య పిక్నీ శనివారం రాత్రి ప్రమాదవశాత్తు ఇంట్లో జారి కింద పడిపోవడంతో తల పగిలి తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఆమె వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు గమనించి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి తరువాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించడంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ చందానాయక్, పైలట్ జక్కుల వీరన్నను బాధితురాలి కుటుంబ సభ్యులు అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక

దోర్నకల్: మండల గౌడ యువజన సంఘం కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని చిలుకోడు గ్రామంలో ఆదివారం జరిగిన గౌడ సంఘం సమావేశంలో యువజన సంఘం ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా కాడెం ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బోయినపల్లి ఉపేందర్, ఉపాధ్యక్షులుగా మామిళ్ల సాయి, మేకపోతుల భాస్కర్, కోశాధికారిగా కాడెం ఉపేందర్, సలహాదారుగా బందం రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లంపిస్కిన్‌తో ఆవులు మృత్యువాత


వ్యాధి సోకిన దూడ

గార్ల: మండలంలోని రాంపురం పంచాయతీ కొత్తతండా, పులిగుట్టతండాల్లో ఆవులు, దూడలకు లంపిస్కిన్ వ్యాధి సోకి చనిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత పశువైద్యాధికారులు, సిబ్బందికి తెలిపినా, ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి ఈ వ్యాధి సోకిన దూడలకు చికిత్స అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన దివ్యాంగుల మహాగర్జన విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 19న మరిపెడలో నిర్వహించే నియోజకవర్గ సన్నాహక సదస్సుకు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ రాకను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగా కోరారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, ఇతర పెన్షన్ దారులకు రూ.4వేలు, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు మోహన్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారావు

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మానుకోట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నాయిని చిన్నఅయిలయ్య మృతిఘటనపై ఆయన భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై కె.శివ ఆదివారం తెలిపారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన అయిలయ్య ప్రమాదవశాత్తు ఆసుపత్రిలోని ఆక్సిజన్ గది పక్కన ఉన్న తలుపులు తీసి, ఆ ప్రాంతమే దారి అనుకుని వెళ్లి అక్కడి నుంచి కిందపడి చనిపోయాడన్నారు. ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు అనంతరం పోస్ట్‌మార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించామని పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం


పొలం మడిలో పడి ఉన్న చెత్త బండి

కురవి: గ్రామంలో పారిశుద్ధ్య పనుల కోసం ప్రభుత్వం అందించిన చెత్త సేకరణ వాహనం(మూడు చక్రాల బండి) నిరుపయోగంగా మారింది. చెత్తను సేకరించడానికి ఉపయోగించాల్సిన వాహనాన్ని పొలం మడిలో పడేసి ఉన్న ఈ దృశ్యం కనిపించింది. సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు గోప తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పక్కనే పొలంలో పడేసి చేతులు దులుపుకున్నారు. వాహనాన్ని వినియోగించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

చివరి మజిలీకి ఇబ్బందులు


కోతకు గురై రాళ్లు తేలిన శ్మశానవాటిక

మరిపెడ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో దహన సంస్కారాలకు తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం ఊరూరా శ్మశాన వాటికలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే మరిపెడ మండలం గిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.15లక్షలు వెచ్చించి శ్మశాన వాటికను నిర్మించారు. కానీ గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదల కారణంగా శ్మశానవాటిక కోతకు గురై రాళ్లు తేలి దర్శనమిస్తోంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి రాళ్లు తేలిన శ్మశానవాటికకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపైనే పశువులు


రోడ్డుపై పడుకున్న పశువులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో రోడ్లనే పశువులను వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది భక్తులు మొక్కుల పరంగా ఆవులను ఆలయాలకు ఇస్తే వాటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి దాణా లేక రోడ్లపైనే ఉండాల్సి వస్తుంది. వాటిని వెంటనే గోశాలకు తరలించాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నెల్లికుదురు: నెల్లికుదురు, ఇనుగుర్తి మండలంలోని వివిధ గ్రామాలల్లో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పరామర్శించారు.

చిన్నగూడూరు: కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బీసు యాకయ్య ఇటీవల బైక్ ప్రమాదంలో గాయమై విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న రెడ్యానాయక్ పరామర్శించారు. అనంతరం కాలికి గాయమై చికిత్స పొందుతున్న అదే గ్రామానికి చెందిన నూకల గంగరాజును పరామర్శించారు.

ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం గార్లలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని, నిర్మాణం పూర్తయినందున పోస్టుమార్టం గదిని వెంటనే ప్రారంభించాలని, జనరేటర్ సౌకర్యం కల్పించాలని, ఆక్సిజన్ ప్లాంటును ప్రారంభించాలని వినతిపత్రంలో ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో ఆస్పత్రిలో వైద్యుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం జిల్లా నాయకుడు కందనూరి శ్రీనివాసరావు, అలువాల సత్యవతి, నాగమణి, చింత మౌనిక, నాగరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


డోర్నకల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డోర్నకల్: స్థానిక నిర్మలా హైస్కూల్‌లో ఆదివారం 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. మిత్రులు గత స్మృతులను నెమరవేసుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నరేష్, బల్విందర్, అజ్మద్ షరీఫ్, నిజామ్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో 2008–09 బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం అనంతారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథం, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లావుడ్యా రాంబాబు నాయక్, ఏకాంబ్రం, చరణ్, సాయి, రవి, మానస, మౌనిక, ప్రియాంక, అనిత, విజయలక్ష్మీ, ఉష పాల్గొన్నారు.


మహబూబాబాద్ అర్బన్: 2008-09 బ్యాచ్ విద్యార్థులు

ముత్యాలమ్మకు బోనాల సమర్పణ

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ముత్యాలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. తమ ఇళ్ల వద్ద బోనాలను తయారు చేసుకుని వాటిల్లో నైవేద్యం పెట్టి ఆలయాలకు వచ్చి, భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, యాటపోతులను బలిచ్చారు. శ్రావణ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావించే భక్తులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. తల్లుల అనుగ్రహంతో వర్షాలు బాగా కురిసి పంటలు మంచిగా పండి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించే విధంగా అమ్మవార్లు దీవించాలని భక్తులు వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కేసముద్రం: కేసముద్రం స్టేషన్‌లో బోనాల వేడుకలు..


దోర్నకల్‌లో బోనాల సందడి


కురవి: బలపాలలో..


మహబూబాబాద్ రూరల్: కొత్త బజారు ముత్యాలమ్మ ఆలయంలో..


దంతాలపల్లి: రామానుజపురంలో..


పెద్దవంగర: ఉప్పరగూడెంలో..


తొర్రూరు రూరల్: గుర్తూరులో..

విరిగిన చెట్లు.. విద్యుత్‌కు అంతరాయం

పాలకుర్తి: వానలకు విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం కురిసిన వర్షానికి విస్నూరులో విద్యుత్ తీగలపై చెట్టు విరిగి పడటంతో తీగలు తెగిపడిపోయారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ డీఈ రాంబాబు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీఈ ఆదేశాల మేరకు లైన్‌మన్ రాజలింగం గ్రామానికి చేరుకుని విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

16న పాపన్న విగ్రహావిష్కరణ


ఎమ్మెల్సీ రవీందర్‌రావుకు ఆహ్వానపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: బహుజనుల కీర్తి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కొనియాడారు. విగ్రహ ఆవిష్కరణ కమిటీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావుకు సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ ఆహ్వానపత్రంను అందజేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహంను ఈనెల 16న ఆవిష్కరించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల వెంకన్న, ముత్యం వెంకన్న, మోహన్, కమలాకర్, శ్రీనివాస్, వెంకటరమణ, వీరేందర్, గణేష్, సతీష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బొగతను తలపిస్తున్న ఆకేరు


గుర్తూరులో పొంగిపొర్లుతున్న ఆకేరువాగు

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామ శివారులో ఉన్న ఆకేరు వాగు రెండురోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో ఆదివారం పొంగిపొర్లింది. ప్రధానంగా ఆకేరువాగుపై ఉన్న మత్తడి బొగత జలపాతంలా ఉండడంతో సందర్శకులు సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్


కురవి: తీజ్ బుట్టతో నృత్యం చేస్తున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్


మహబూబాబాద్ రూరల్: ఇస్లావత్ తండా(సింగారం) గ్రామంలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు


గార్ల: తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య


తీజ్ బుట్టతో చిన్నారి శ్రీహిత

లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోధుమ నారుబుట్టలను యువతులు నెత్తిన ఎత్తుకుని నృత్యాలు చేస్తూ.. చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్